
యువతనూ వేధిస్తున్న కీళ్ల నొప్పులు

- పెరుగుతున్న సమస్యలు
- ఆధునిక జీవన శైలి కారణం
- కీళ్ల నొప్పులను తేలిగ్గా తీసుకోవద్దు
- బాధితులందరికీ ఆపరేషన్ అవసరం లేదు
- రేపు వరల్డ్ ఆర్థరైటీస్ డే

గుంటూరు శ్రీనగర్‌కు చెందిన సాయి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. నిత్యం కంప్యూటర్ వద్ద కూర్చొని పనిచేయడం, కుటుంబం అంతా గుంటూరులో ఉండటంతో ఫాస్ట్‌ఫుడ్స్ తీసుకోవడం, వ్యాయామం లేకుండా ఇంటికే పరిమితం అవడంతో 30 ఏళ్లు నిండకుండానే ఆర్థరైటీస్ బారిన పడ్డాడు. చిన్న వయస్సులోనే కీళ్ల నొప్పుల సమస్య రావడంతో వైద్యులను సంప్రదించాడు. యంగ్ ఆర్థరైటీస్ సమస్య ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలను వివరించారు.





గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల నేడు యువత ఆర్థరైటీస్ బారిన పడుతున్నారని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్లు దాటగానే యంగ్ ఆర్థరైటీస్ సమస్యతో వస్తున్నారని, దీనిని సకాలంలో గుర్తించి నివారించాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నారు. కీళ్ల బాధల నుంచి విముక్తుల్ని చేసి మనిషికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించటమే ప్రపంచ ఆర్థరైటీస్ డే ప్రధాన ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా అక్టోబరు 12న ప్రపంచ ఆర్థరైటీస్ డేను 1996 నుంచి ఆర్థరైటిస్ అండ్ రుమాటిజం ఇంటర్‌నేషనల్(ఏఆర్‌ఐ) సంస్థ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఆర్థరైటీస్ అంటే ?

కీళ్లలో గుజ్జు (సైనోవియల్ ఫ్లూయిడ్) ప్రతి వ్యక్తికి వయస్సు 50 ఏళ్లు వచ్చేదాకా ఉత్పత్తి అవుతూ, ఎక్కువగా ఉంటుంది. 50 ఏళ్ల వయస్సు దాటాకా కీళ్లలో గుజ్జు ఉత్పత్తి ఆగిపోతుంది. మృదులాస్థి (కార్టిలేజ్)కి సరిపడా ఆహార పోషణ పదార్థాలు వెళ్ళవు. కార్టిలేజ్ ఎండిపోయి పగుళ్ళు వచ్చి పూర్తిగా దెబ్బతింటుంది. దీన్నే ఆర్థరైటీస్ అంటారు.

రావడానికి కారణాలు

స్థూలకాయం, శారీరక వ్యాయామం లేకపోవడం, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు చూస్తూ గంటల కొద్దీ కుర్చీలకే అతుక్కుని పని చేయడం, ఎక్కువసేపు కూర్చుని పనులు చేయడం వల్ల కీళ్ళలో గుజ్జు (కార్టిలేజ్) తగ్గిపోయి ఆర్థరైటీస్ వస్తుంది. వయస్సుతో పాటు, నడకలో ఉన్న రాపిడి వల్ల అరిగిపోయి గుజ్జు ఉత్పత్తికి, వినియోగానికి సమతుల్యం లేకపోవడం వల్ల వస్తుంది. కార్టిలేజ్ పార పోయి ఎముక ఎక్స్‌పోజ్ అవడం వల్ల మోకీళ్ల నొప్పులు వస్తున్నాయి. జన్యుపరమైన కారణాలతో మహిళల్లో ఇది ఎక్కువగా వస్తుంది. భారతదేశ సంప్రదాయాల ప్రకారం స్త్రీలు ఇంటి పనులను కింద కూర్చుని చేయడం, మోకీళ్ళపై ఎక్కువ భారం వేసి పనులు చేయడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. పొగ తాగడం, మద్యం సేవించడం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, 50 సంవత్సరాలు పైబడిన వారిలోనూ, గతంలో కీళ్ళకు దగ్గరగా ఫ్రాక్చర్ అయిన వారిలో, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్ వల్ల, మహిళల్లో రుతు క్రమం ఆగిపోయినవారిలో కీళ్ళ అరుగుదల ఉంటుంది.

ఆర్థరైటీస్ బాధితులు

జిల్లాలో 300 మంది ఆర్థోపెడిక్ వైద్యులు సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ పది మంది బాధితులకు వైద్య సేవలందిస్తున్నారు. బాధితుల్లో మగవారికంటే ఆడవారి సంఖ్య చాలా ఎక్కువ. బాధితులు వందమంది ఉంటే వారిలో 75 మంది ఆడవారే. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 50 నుంచి 70 మంది కీళ్ళ నొప్పులతో వైద్యం పొందుతున్నారు.

ఆపరేషన్ చేసిన రోజే నడుస్తున్నారు



మోకీళ్ల బాధితులకు నేడు అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. కీళ్ళ నొప్పులతో బాధపడే ప్రతి వంద మందిలో ఐదు నుంచి పది శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది. ఫాస్ట్ ట్రాక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలతో ఆపరేషన్ చేసిన రోజే నడుస్తున్నారు. మూడు రోజుల్లో ఇంటికి వెళ్ళిపోవచ్చు. మోకీళ్ళ మార్పిడి ఆపరేషన్లలో నూటికి 99.2శాతం విజయాలు ఉన్నాయి. మోకాళ్లలో అనవసరంగా ఇంజక్షన్లు చేయించడం ద్వారా జాయింట్ దెబ్బతింటుంది. కార్టిలైజ్ డామేజ్ జరగడం, జాయింట్‌లో ఉంటే కుషన్ దెబ్బతింటుంది.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

నివారణ చర్యలు

క్రమబద్ధమైన వ్యాయామం చేస్తూ బరువును నియంత్రణలో పెట్టుకోవాలి. సమీకృత ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, విటమిన్–డీ, కాల్షియం అధికంగా లభించే పాలు, పాల ఉత్పత్తులు, కోడిగుడ్లు, చేపలు, మొలకెత్తిన విత్తనాలు, రాగులు, జొన్నలు, ఆహారంలో తీసుకుంటే ఎముకల్లో గుజ్జు పెరుగుతుంది. 50 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా ప్రతిరోజూ 30 నిమిషాలపాటు మోకాలిచుట్టూ ఉండే కండరాలకు ఫిజియోథెరపీ, వ్యాయామం చేసుకోవాలి.

ఆర్థరైటీస్‌లో మూడు దశలు...

మొదటి దశలో ఉదయానే నిద్రలేవగానే మోకీళ్ళు పట్టివేసినట్లు ఉండటం, మెట్లు ఎక్కినా, దిగినా నొప్పులు రావటం, కింద కూర్చుని లేచేందుకు ఇబ్బంది పడటం, ఇండియన్ టాయ్‌లెట్ వాడేందుకు ఇబ్బంది పడటం జరుగుతుంది. ఫిజియోథెరపీతో దీనిని నియంత్రణలో పెట్టవచ్చు. రెండో దశలో కూర్చుని లేవటానికి ఇబ్బంది పడటం, నడక ప్రారంభంలో 10 అడుగులు వేశాక నొప్పి ఉండి తర్వాత తగ్గటం, మెట్లు ఎక్కినా, దిగినా ఇబ్బందిగా ఉంటుంది. సంప్రదాయ మరుగుదొడ్డి వాడలేక ఇబ్బంది పడతారు. వైద్యుల సలహాలు పాటిస్తూ కొన్ని రకాల మందులు, జాయింట్స్‌లో ఇంజెక్షన్లు చేయించుకుంటూ వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు. మూడో దశలో కీళ్ల మార్పిడి ఆపరేషన్ (జాయింట్ రీప్లేస్‌మెంట్) తప్పనిసరిగా చేయించుకోవాల్సిందే.

క్లుప్తంగా

సీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శోభారాణి



నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు నూతనంగా సీఎంహెచ్‌ఓగా విధుల్లో చేరిన శోభారాణికి సూచించారు. సీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన శోభారాణి గురువారం నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడుని సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మేయర్ తెలిపారు. ముఖ్యంగా మురికివాడల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

మసీదులు, దర్గాలకు కూడా స్వయం ప్రతిపత్తి కల్పించాలి

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు కలీం

లక్ష్మీపురం: దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కూటమి ప్రభుత్వం, మసీదులు, దర్గాలకు కూడా కల్పించాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ గుంటూరు అధ్యక్షులు మహమ్మద్ కలీం అన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ, అధికార జోక్యాలతో రాష్ట్ర వక్ఫ్ సంస్థ ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి అనుకూల సంస్థగా మారిపోయి పూర్తిగా నిర్వీర్యం అయి పోతుందని తెలిపారు.

సుదీర్ఘ కాలంగా సంస్థ సీఈవోగా అర్హత లేని వ్యక్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలకు ఏ విధంగా అయితే స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందో అదే విధంగా మసీదులు, దర్గాలపై కూడా అధికార, రాజకీయ జోక్యాన్ని చెక్ పెట్టే విధంగా వెంటనే జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ముస్లిం సమాజం డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

పేదల పక్షాన పోరాడిన మస్తాన్‌రావు



నెహ్రూనగర్: పేదల పక్షాన నిలబడి వారి కోసం అహర్నిశలు పోరాటం చేసిన యోధుడు, బహుజనవాది దేవరపల్లి మస్తాన్‌రావు అని రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మస్తాన్‌రావు 16వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కాకుమానువారితోటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ మస్తాన్‌రావు భరోస కల్పించేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, ఈమని ఉమామహేశ్వరరావు, ముత్తయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

అప్పులతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: తీసుకున్న అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో పురుగుల మందు తాగి ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీ అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంతానికి చెందిన నన్నపనేని సంపత్‌కుమార్ (31)కి భార్య నాగప్రసన్న, ఇద్దరు సంతానం ఉన్నారు. సంపత్‌కుమార్ మెడికల్ షాపులో గుమస్తాగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రూ.5 లక్షల అప్పు ఎలా తీర్చాలంటూ మనోవేదనతో సెప్టెంబర్ 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సంపత్‌కుమార్ మృతి చెందాడు.భార్య ప్రసన్న ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

13న వైదిక ధర్మ ప్రచార సమితి బిరుదుల ప్రదానం

నగరంపాలెం: ప్రఖ్యాత వైదిక ధర్మ ప్రచారకులు కోనేరు జానకీదేవికి 'ఆర్యమాత', కొత్త మాసు మల్లికార్జునరావుకు 'ఆర్య పురుష' బిరుదులు, నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్లు పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరి సూర్యనారాయణ తెలిపారు. అరండల్‌పేటలోని సమితి కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమితి 20వ వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 13న గుంటూరు అరండల్‌పేట 11/3వ అడ్డరోడ్డులోని ఆర్య సమాజ మందిరంలో సత్కార గ్రహీతలకు బిరుదులు, నగదు పురస్కారాలు అందిస్తామని చెప్పారు.

జీహెచ్‌ఎంసీలో ఆస్తి పన్ను విధింపుపై కమిషనర్ పరిశీలన



జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న పథకాలను గురించి తెలుసుకుంటున్న కమిషనర్

నెహ్రూనగర్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను విధింపు, వసూళ్లు, సమగ్ర రహదారి నిర్వహణ విధానం, ఆర్థిక వనరులు, ముఖ్యమైన ప్రాజెక్టులను గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పరిశీలించారు. వివిధ రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లలో అమలు చేస్తున్న కార్యక్రమాల స్టడీ టూర్‌లో భాగంగా గురువారం జీహెచ్‌ఎంసీలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, ప్రాజెక్టులను నగర కమిషనర్ బృందం పరిశీలించింది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నగర జనాభా, నివాస, కమర్షియల్ భవనాలు, ఆస్తి పన్ను విధింపు, వసూళ్ళు వివరాలను నోడల్ అధికారులు వివరించారు. హైదరాబాదులో అమలు చేస్తున్న సమగ్ర రహదారి నిర్వహణ విధానాన్ని కమిషనర్ బృందం పరిశీలించి, విధి విధానాలను తెలుసుకుంది. ఆస్తి పన్ను పరిధిలోకి వచ్చే భవనాల భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) ద్వారా పర్యవేక్షణ తీరును పరిశీలించారు. ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా హైదరాబాదు ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పాయింట్, విండ్రో కంపోస్ట్ యూనిట్‌లను సమగ్రంగా పరిశీలించారు. నిర్వహణ, పనితీరు, ఖర్చులను జీహెచ్‌ఎంసీ అధికారులు వివరించారు.



గంటలమ్మ చెట్టు శ్రీ వాసవీ మాత దేవస్థానంలో శ్రీదుర్గాదేవిగా..



లాలాపేట శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ గజలక్ష్మీదేవిగా..



కొత్తపేట పశువుల ఆస్పత్రి ఎదురు శ్రీజగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీ ధనలక్ష్మీదేవిగా..

అమ్మవారి అలంకారం..దేదీప్యమానం

నగరంలో దసరా సందడి నెలకొంది. తూర్పు నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో అమ్మవారు గురువారం వివిధ అలంకారాల్లో దేదీప్యమానంగా వెలిగిపోయారు. అమ్మలగన్న అమ్మ రూపం భక్తుల మదిలో భక్తి భావాన్ని నింపింది. ఆమె సన్నిధిలో పూజలు నిర్వహించారు.

– నగరంపాలెం



కొత్తపేట శ్రీ పెద్దమహాలక్ష్మమ్మ, శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీదుర్గాదేవిగా..



సంగడిగుంట రెడ్లబజార్ శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రీ దుర్గాదేవిగా..



ఆర్.అగ్రహారం శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో రాజ్యలక్ష్మిదేవిగా..



ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాళికాదేవిగా..



గుంటూరు ఆర్.అగ్రహారంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు భవిష్య, సౌందర్య

అమ్మవారిని దర్శించుకున్న తూర్పు ఇన్‌చార్జి నూరిఫాతిమా

నగరంపాలెం: సంగడిగుంట రెడ్లబజార్‌లోని శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గురువారం శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ షేక్ నూరి ఫాతిమా అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మొరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మల్లం సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అరవ ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు శ్రీపత్రి అప్పారావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



భారతదేశ ధ్రువతార రతన్ టాటా

గుంటూరు ఎడ్యుకేషన్: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా భారతదేశ ధ్రువతార అని మహాత్మాగాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్, ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఎన్జీవో కాలనీలోని మహాత్మాగాంధీ కళాశాలలో టాటా గ్రూప్ గౌరవ చైర్మన్ రతన్ టాటాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అధ్యక్షతన జరిగిన సంతాప కార్యక్రమంలో డీఏఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రతన్ టాటా గొప్ప మానవతావాది అని కొనియాడారు. నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడుతూ రతన్ టాటా గొప్ప మానవతా విలువలు కలిగిన వ్యక్తిగా పేర్కొన్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా మంచి పేరు సంపాదించారని తెలిపారు. డి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఇంటింటా టాటా ఉత్పత్తుల వినియోగమే ఆయన విజయానికి సాక్ష్యమని పేర్కొన్నారు.



సంతాప సభలో డీఏఆర్ సుబ్రహ్మణ్యం, చందు సాంబశివరావు, శాంతమూర్తి

దేశం మేరునగధీరుడిని కోల్పోయింది

లక్ష్మీపురం: రతన్‌టాటా మృతి భారతదేశానికి తీరని లోటని, ఆర్థిక, సామాజిక, వ్యాపార దిగ్గజాన్ని కోల్పోయిందని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్ విచారం వ్యక్తం చేశారు. మేడికొండూరు మండలం పేరేచర్ల డొంకలో గురువారం రతన్ న్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించి మౌనం పాటించారు.

15 ఏళ్లుగా చోరీలు.. 30కిపైగా షట్టర్లు ఫట్!

- గంజాయి విక్రయిస్తూ చిక్కిన నిందితుడు
- ఇప్పటికే అతడిపై పలు దొంగతనం కేసులు
- 3.78 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరేంద్రబాబు

లక్ష్మీపురం: 15 సంవత్సరాలుగా చోరీలు చేస్తూ.. 30కిపైగా దుకాణాల షట్టర్లు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడిన కేసుల్లో నిందితుడు పోలీసులకు చిక్కాడు. గంజాయి విక్రయిస్తుండగా పట్టాభిపురం పోలీసులకు పట్టుబడ్డాడు. తీగ లాగితే డొంక కదిలినట్లు దర్యాప్తులో అతడు చేసిన దొంగతనాల చిట్టా వెలుగుచూసింది. పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు గురువారం తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా మార్కాపురం గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసగా మారడంతో భార్య విడిచి వెళ్లిపోయింది. తర్వాత దొంగతనాల బాట పట్టాడు. ఆ డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. మార్కాపురం, గుంటూరులోని కొత్తపేట, పాతగుంటూరు, నగరంపాలెం, లాలాపేట, నల్లపాడు తదితర పోలీస్ స్టేషన్ పరిధిలో దుకాణాల షట్టర్లు పగలగొట్టి దొంగతనం చేసిన కేసులు ఇతడిపై ఉన్నాయి. ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడు జైలుకు వెళ్లి వచ్చాడు. అయినప్పటికీ చోరీలు చేస్తూనే ఉన్నాడు. ఇలా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 9వ తేదీన చోరీ కేసులో అరెస్టు అయ్యాడు. జైలుకు వెళ్లొచ్చాడు. తర్వాత తాడేపల్లి, అరండల్‌పేట, పట్టాభిపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో నాలుగు షట్టర్లు పగలగొట్టి దొంగతనం చేశాడు. ఆ డబ్బుతో జల్సాలు చేస్తూ రైల్వే స్టేషన్‌ల పరిసరాల్లో సంచరించేవాడు. ఈ నెల 8వ తేదీన రాత్రి నల్లపాడు రైల్వే స్టేషన్‌లో ఒక గుర్తు తెలియని వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం వచ్చింది. పట్టాభిపురం పోలీసులు వెంటనే శ్యామలానగర్ గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో శ్యామలానగర్ రైల్వే ట్రాక్ వద్ద వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 3.78 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో గంజాయి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో పట్టాభిపురం ఎస్సైలు రాంబాబు, తరంగిణి, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు సత్కారం



ఎస్పీని సత్కరిస్తున్న దళిత సంఘాలు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను గురువారం సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజాసుందర్‌బాబు, పదిహేను దళిత సంఘాలు సత్కరించాయి. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బెస్ట్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భీమసేన సేవాదళ్ నాయకులు నల్లపు నీలాంబరం, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం నాయకులు తిప్పాబత్తుని గోవింద్, జీజీహెచ్ ఉద్యోగుల అధ్యక్షులు ప్రేమజ్యోతిబాబు, ఏపీ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోపర్తి శ్రీను, రవి, భాగ్యరాజు, శ్రామిక కార్మిక సమాఖ్య జాతీయ నాయకులు మంచాల జోసెఫ్, దళిత నాయకులు జల్లి మోహన్, సముద్రాల కోటేశ్వరరావు, కళ్యాణి పాల్గొన్నారు.

21న సమకాలీన రాజకీయ పరిణామాలపై సభ

లక్ష్మీపురం: గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 21న సాయంత్రం 4గంటలకు సమకాలీన రాజకీయ పరిణామాలపై జరిగే సభను జయప్రదం చేయాలని శాసన మండలి సభ్యులు కె.యస్.లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సభ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు, శాసన మండలి సభ్యులు కె.యస్.లక్ష్మణరావు తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ కూటమి 3వ సారి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇసుక సమస్య తీవ్రంగా ఉందని, భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు జరపకుండా సున్నితమైన అంశాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. ఈ స్థితిలో ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని, ఈ నేపథ్యంలో జరిగే సభలో ఎక్కువ మంది ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.